## నేడు బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి రాక

ఆమనగల్లు,(మాడ్గుల) మార్చి 23 : మాడ్గుల మండల పరిధిలోని అప్పారెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు.

## స్వామివారి విగ్రహాలు అపహరణ

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 23 : లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చోరీకి పాల్పడి స్వామివారి పంచలోహ విగ్రహాలను దుండగులు అపహరించారు. ఈ ఘటన పోచారం గ్రామంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. పోచారం గ్రామ సమీపంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజారి కృష్ణమాచారి ప్రతిరోజు ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయ సమీపంలోని ఇటుకల కింద తాళంచెవి పెట్టి వెళ్తారు. పూజారి ఇటీవల తిరుమల దర్శనానికి వెళ్లటంతో ఇది గమనించిన కొందరు దుండగులు సుమారు రూ.60 వేల విలువ చేసే విగ్రహాలను తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజుతో పాటు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. దేవుడి విగ్రహాలను దొంగిలించారన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఆపదలో ఉన్నవారిని ఆందుకుంటాం

ఆర్థికసాయం అందజేస్తున్న దాత

కడ్తాల్, మార్చి 23 : గ్రామంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకుంటానని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కంబాలపల్లి జంగయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. స్థానిక నాయకులతో మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించాడు అనంతరం బాధిత కుటుంబానికి ఆయన రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు రామచంద్రయ్య, రాములు, నర్సింహ, మహేశ్, అంజి, కృష్ణ, జంగయ్య, రవి, శ్రీకాంత్, ప్రశాంత్, కరుణాకర్, దాసు, రాఘవ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

దేవుని పడకల్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

- దేవునిపడకల్‌లో ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- ఈ నెల 31 వరకు నిర్వహణ
- 28న తిరుకల్యాణోత్సవం, 31న గుండులాగుడు పోటీలు

కడ్తాల్, మార్చి 23 : జిల్లాలో పురాతన ఆలయంగా ప్రసిద్ధి గాంచిన తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏకశిలలో శ్రీదేవీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గరుడవాహనంపై వెలసిన ఆలయంగా పేరొందింది. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో ఇక్కడ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు నమ్ముతారు. నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు వచ్చే వారి కోసం తాగునీరు, వసతి, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు హైదరాబాద్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

**బ్రహ్మోత్సవాల వివరాలు ఇలా..**

శ్రీవారి బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్త రాజ్‌కుమార్‌రెడ్డి, ఈవో స్నేహలత, స్వామి ఆరాధకులు శ్రీమాన్ నడాదూర్ రామాచార్యులు, శ్రీమాన్ పరవస్తు గోపాలచార్యులు తెలిపారు. ఆదివారం స్వామివారికి అభిషేకం, స్వస్తివాచనం, అంకురార్పణ,

ఆలయంలోని దేవతామూర్తులు

25న ఆదివాసం, ధ్వజారోహణం, భేరీపూజ, దేవత్వాహానం, హోమం, బలిహరణం, తీర్థప్రసాదగోష్ఠి, సింహవాహనసేవ, 26న పారాయణములు, హంసవాహనసేవ, బలిహరణం, హనుమంత వాహనం, 27న పారాయణములు, మోహినీసేవ, హోమం, గరుడసేవ, రాత్రికి ఎదుర్కోళ్లు, 28న పారాయణములు, 11 గంటలకు తిరుకల్యాణోత్సవం, గజ వాహనంపై సేవ, 29న పారాయణములు, మహాభిషేకం, ప్రాతఃకాల పూజ నిజరూప దర్శనం, రాత్రికి రథోత్సవం, 30న పారాయణములు, అమ్మ వారికి సామూహిక కుంకుమార్చనలు, అశ్వవాహనం, లంకాదహనం, 31న చక్రతీర్థం, పుష్పయాగం, ధ్వజారోహణం, దేవతావిసర్జన, శేషవాహనంపై సేవ, ఎడ్లతో గుండు లాగుడు పోటీలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు వివరించారు.

## ఆలయంలో ఘనంగా శని త్రయోదశి

తుర్కయాంజాల్ : మునగనూర్ శనైశ్చర దేవాలయంలో హోమం చేస్తున్న భక్తులు

తుర్కయాంజాల్, మార్చి 23 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మునగనూర్‌లోని శనైశ్చర దేవాలయంలో శని త్రయోదశిని పురస్కరించుకొని శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తైలాభిషేకాలు, అర్చనలు, హారతి, హోమం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనైశ్చరుడికి నల్లవస్త్రం, నువ్వులు, కొబ్బరికాయలు, గంధం, పసుపు, కుంకుమ, నీటితో అభిషేకాలు చేశారు.

**షాద్‌నగర్‌టౌన్** : శని త్రయోదశిని సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలోని శనైశ్చరుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సహస్రనామార్చన వంటి ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకులు తెలిపారు. విష్ణుమూర్తికి ఇష్టమైన రోజు శనివారం, శివుడికి ఇష్టమైన రోజు త్రయోదశి రెండు కలిపి వచ్చే రోజున స్వామివారికి పూజలు చేయడం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్నారు. స్వామివారికి విశేష తైలాభిషేకాలతో పూజలు చేశారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

పూజల్లో గ్రామ పెద్దలు, భక్తులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 23: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలోని గుట్ట శివాలయంలో ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాచండీ యాగం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఊరేగింపులు, భజనలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దోటి శంకర్ యాదవ్, గ్రామ పెద్దలు లెక్కల విఠల్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీఖాన్, మాజీ సర్పంచ్ తుడుము మల్లేశ్, కమిటీ వైస్ చైర్మన్ గ్యార ఆదిస్వామి, సభ్యులు లెక్కల అంజిరెడ్డి, నారం సంధ్యారాణి, చింతకాయల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలపై దాడులు సిగ్గుచేటు

తుర్కయాంజాల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

యాచారం, మార్చి 23 : దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈడీని అడ్డుపెట్టుకొని ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయడం సిగ్గుచేటని, రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య అన్నారు. మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పై ఈడీని అడ్డుపెట్టుకొని మోదీ ప్రతీకార దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మయ్య, శ్రీమన్నారాయణ, వినోద్, సురేశ్, జంగయ్య, ఉపేందర్, బంటి తదితరులున్నారు.

**ఇబ్రహీంపట్నం** : అక్రమ కేసులతో ప్రతిపక్ష నాయకులను భయాందోళనకు గురి చేస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సామెల్ అన్నారు. మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోదీ కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జంగయ్య, ముసలయ్య, రాములు పాల్గొన్నారు

**.ఓటమి భయంతోనే దర్యాప్తు సంస్థలతో దాడులు**

తుర్కయాంజాల్, మార్చి 23 : ఎలక్ట్రోరల్ బాండ్లలో బీజేపీ అవినీతిపై ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని, ఓటమి భయంతోనే బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష నాయకులపై దాడులను చేయిస్తున్నదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కిషన్ అన్నారు. మున్సిపాలిటీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు.

న్యాయసేవా సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

మంచాల, మార్చి 23 : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో జరిగే నేరాల పట్ల ప్రజలను చైతన్య పర్చేందుకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలకు బలికాకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ బాబ్యానాయక్, ఎస్ఐ రవినాయక్, న్యాయవాది మంకు మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

## 25మంది విద్యార్థులు గైర్హాజరు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 23: పదో తరగతి వార్షిక పరీక్షలు షాద్‌నగర్ పట్టణంలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలో 10, ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద పరీక్షా కేంద్రంలో శనివారం 2417మంది విద్యార్థులకు 2392 మంది పరీక్షకు హాజరు కాగా 25మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో శంకర్‌రాథోడ్ తెలిపారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని వసతులను కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, మార్చి 23 : మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, చక్రతీర్థం, మహా పూర్ణాహుతి, శకటోత్సవం, ధ్వజారోహణం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పుట్టపాక రాంచందర్‌రావు, అర్చకులు వింజమూరి రామానుజాచార్యులు, ఆదిత్యచార్యులు, చిదంబరశర్మ, శిరీష్‌కుమార్, క్రాంతికుమార్, ఎంపీటీసీ గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు తగవు

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

షాద్‌నగర్, మార్చి 23: షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తన పదవి కాలంలో ఏనాడు ప్రజలను ఇబ్బంది పెట్టలేదని, అతడిపై ఆరోపణలు చేయడం సరికాదని షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరు నుంచి షాద్‌నగర్ పట్టణ ముఖ్యకూడలి వరకు పాత జాతీయ రహదారి విస్తరణలో నివాసితులు, వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు ప్రజల ఆస్తులకు భంగం కలిగిస్తూ రోడ్డు విస్తరణ పనులు చేపట్టిందని కొందరు రాజకీయ నాయకులు అనడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొత్తూరు నుంచి షాద్‌నగర్ పట్టణ ముఖ్యకూడలి వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తర్లకు రూ. 112.75కోట్లను మంజూరు చేయించారని గుర్తు చేశారు. గతంలో షాద్‌నగర్ మెయిన్ రోడ్డు వేసే సమయంలో కూడా ఏ ఒక్క ఇంటినీ కూల్చలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజ్, కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, జీ.టీ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిశోర్, నాయకులు రవియాదవ్, సలీం, రాఘవేందర్, శ్రీకాంత్, అశోక్, విజయ్, హన్మంత్, రఘు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆమనగల్లు : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

- ఐసీడీఎస్ సీడీపీవో రోజా

ఆమనగల్లు, మార్చి 23 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సీడీపీవో రోజా అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఐసీడీఎస్ ఆమనగల్లు ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, పోషణపక్షం వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఫరూఖ్ హుస్సేన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో రోజా మాట్లాడుతూ.. సమాజంలో అసమానత లేకుండా కృషి చేయాలన్నారు. సమతుల్య ఆహారం గురించి వివరించారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థులు నృత్యాలు చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయ, కేజీబీవీ స్టాఫ్, ఐసీడీఎస్ సిబ్బంది, ప్రజ్వళన హోం సిబ్బంది, ఆంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

**మొయినాబాద్** :మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, దీపికారెడ్డి, డీన్ ఉదయశ్రీ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## బెల్టుషాపులపై పోలీసుల దాడులు

యాచారం, మార్చి23 : వివిధ గ్రామాల్లో బెల్టు షాపులపై శనివారం సాయంత్రం యాచారం పోలీసులు దాడులు నిర్వహించారు. కొత్తపల్లి, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన అల్లం నాగరాజు అనే వ్యక్తికి చెందిన కిరాణా షాపులో 8 మద్యం బాటిళ్లు, 14బీరు బాటిళ్లు, తమ్మలోనిగూ డ గ్రామానికి చెందిన బాలం రాము లు అనే వ్యక్తికి చెందిన కిరాణా షాపులో 10 మద్యం బాటిల్లు, 14 బీరు బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు.

## గంజాయి విక్రేత అరెస్టు

ఇబ్రహీంపట్నం, మార్చి 23: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన చంద్రవమ్స్ బిండ్త్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీసులతో కలిసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

## సమ్మె నోటీసు అందజేత

సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23 : బాటింగారంలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డికి సీఐటీయూ నాయకులు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా దిగుమతి చార్జీలు పెంచకపోవడంతో సమ్మె నోటీసు ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ వరకు హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అదే రోజు అర్ధరాత్రి నుంచి సమ్మె చేపడుతామని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ అంగీకరించి పెంచిన దిగుమతి చార్జీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం వీరయ్య, పండ్ల మార్కెట్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ మసూద్, కార్మిక నాయకులు ఎండీ షరీఫ్, పోచయ్య, చిన్న, రాములు, గంగారాం, తిప్పన, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ మొక్కలను సంరక్షించాలి

యాచారం, మార్చి 23 : నర్సరీ మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మంథన్‌గౌరెల్లి, మంథన్‌గౌడ్ గ్రామాల్లో శనివారం పర్యటించారు. నర్సరీల్లో పెంచుతున్న హరితహారం మొక్కలను పరిశీలించారు. కంపోస్టు యార్డులను సైతం పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. నర్సరీ మొక్కలు ఎండిపోకుండా ప్రతి నర్సరీకి గ్రీన్‌షెడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎండిపోయిన మొక్క స్థానంలో మరో మొక్క నాటాలని సూచించారు.

## క్రమశిక్షణతో చదవాలి

ఆదిబట్ల, మార్చి 23: విద్యార్థులు క్రమశిక్షణలో చదివి దేశాభివృద్ధికి దోహదపడాలని జస్టిస్ సురేందర్ అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి, మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇం జినీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాకారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమోహన్‌రెడ్డి ,వైస్ ప్రిన్సిపాల్ లక్కంశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడు.. కుటుంబ సభ్యులకు అప్పగింత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23 : మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడిని సురక్ష సేవా సంఘం సభ్యులు శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వనస్థలిపురం ఎన్‌జీవో కాలనీలో శాంతి ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నది. పిల్లలను మందలించడంతో మనస్తాపం చెందిన జోనాథన్(12) ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో తిరుగుతుంటే సంఘం సభ్యుడు రవి గుర్తించి సురక్ష సేవా సంఘానికి సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు ఆ బాలుడిని చేరదీసి వాట్సాప్ గ్రూపుల్లో విషయాన్ని పోస్టు చేశారు. సమాచారాన్ని తెలుసుకుని వచ్చిన అబ్బాయి తల్లి, బాబాయికి బాలుడిని అప్పగించినట్లు సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్ తెలిపారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

యాచారం: నివాళులర్పిస్తున్న నాయకులు

యాచారం : మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని శనివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో కలిసి భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు కంబాలపల్లి విప్లవ్‌కుమార్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు. ఇరవైమూడు సంవత్సరాల వయస్సులోనే భగత్‌సింగ్ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమంలో అంజయ్య, బ్రహ్మయ్య, వంశీ, భూషణ్ తదితరులున్నారు.

**చేవెళ్లటౌన్** : యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ రాములు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి అన్నారు. భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్లలో భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీను, సాయి కుమార్, శివ శంకర్, మల్లేశ్, వెంకటేశ్, కుమార్, ముఖేశ్ పాల్గొన్నారు.

**ఆమనగల్లు** : మండల కేంద్రంలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుకుదేవ్‌ల వర్ధంతిని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పిప్పళ్ల శివశంకర్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు వస్పుల రవీందర్, నాయకులు అరుణ్‌కుమార్, పవన్, చందు, సాయికుమార్, అధ్యాపకులు కృష్ణయ్య, చెన్నయ్య, విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్‌రూరల్** : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని భగత్‌సింగ్ కాలనీలో భగత్‌సింగ్ వర్ధంతిని యూత్ సభ్యులు నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు ప్రభాకర్, నక్కల వెంకటేశ్, సాంబశివరావు, శ్రీధర్, భిక్షపతి, నర్సింహులు పాల్గొన్నారు.

**మంచాల** : భగత్‌సింగ్ ఆశయన సాధన కోసం యువత ముదుకు రావాలని చండీశ్వరయూత్ అధ్యక్షుడు పరమేశ్ అన్నారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్, శ్రీశైలం, మల్లేశ్, నాగరాజు, శేఖర్, వంశీ, సురేశ్, శ్రీకాంత్, శివలింగం, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు

మొయినాబాద్, మార్చి 23 : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ ఘటన మొయినా బాద్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన దరువుపల్లి బాలయ్య, జయమ్మ దంపతుల చిన్న కుమారుడు రాజేందర్ (33)

రాజేందర్

రియల్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 16న రోజు మాదిరిగానే ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులతో కలిసి ఉండొచ్చని తల్లిదండ్రులు భావించారు. వారం రోజులైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన వారు శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## భూకబ్జా కేసులో పలువురికి రిమాండ్

ఆదిబట్ల, మార్చి 23 : భూ కబ్జా కేసులో కన్నారావు ముఖ్య అనుచరుడు డానియల్‌ను ఆదిబట్ల పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మన్నెగూడ సర్వేనంబర్-32 లోని 2 ఎకరాల 17గుంటల భూవివాదంలో ఈ నెల 3న ఓఎస్ ఆర్ కంపెనీకి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీని ధ్వంసం చేసి అందులో పనిచేస్తున్న కూలీలపై దాడి చేసిన ఘటనలో 38 మందిపై కేసు నమోదు నమోదైంది. అందులో పది మందిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కన్నారావు తప్పించుకుని సింగ